## మంత్రి వర్గంలో మార్పులు

**మొదటి పేజీ తరువాత..**

సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారం.

**ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు**

ఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.



## కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- సంగెం మండలంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- 113 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 81 లక్షల విలువైన చెక్కుల అందజేత

**గోల్కొండ టైమ్స్, సంగెం :**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మొత్తం 113 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 65 మంది లబ్ధిదారులకు రూ. 65,07,540 విలువైన చెక్కులు. ముఖ్యమంత్రి సహాయనిధి 48 మంది లబ్ధిదారులకు రూ. 16,36,000 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు సంగెం మండల వ్యాప్తంగా మొత్తం 1,071 మంది లబ్ధిదారులకు రూ. 7,56,21,724 పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా, ఒక వరంగా మారాయని కొనియాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న చెక్కులను గుర్తించి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సకాలంలో లబ్ధిదారులకు అందేలా ప్రత్యేక కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ఇది ముమ్మాటికీ ప్రజల ప్రభుత్వమని స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రజలందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రైతు సంక్షేమంలో రాజీపడం

**మొదటి పేజీ తరువాత..**

సిద్ధం చేయాలన్నారు. రైతులను లాభసాటిగా చేసేలా అవసరమైతే ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం, మోదీతో మాట్లాడుదామన్నారు. అయిల్ పామ్ పరిశ్రమ లాభసాటిదన్నారు. ప్రతిపంట సాగులో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో ఒక్కో జిల్లా ఒక్కో పంటకు ప్రసిద్ధి. రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయి. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల యూరియా కొరత ఏర్పడే సమస్య ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో తయారవుతున్న యూరియా మొత్తం మనకే ఇవ్వాలి. యుద్ధం కారణంగా తెలంగాణలో యూరియా కొరత రాకుండా ఉండేందుకు కాంగ్రెస్, బీజేపీ ఎంపీలతో కూడిన ప్రతినిధుల బృందాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలని దీన్ని మంత్రి తుమ్మల సమన్వయం చేయాలన్నారు.

**మహిళలకు ప్రాధాన్యత**

రాష్టంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఎకనమిగా ఎదుగుతుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళలకు అర్థ భాగస్వామ్యం




వచ్చినప్పుడే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందన్నారు.

**2029లోనూ కాంగ్రెస్ దే అధికారం..!**

2029లోనూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ గెలవాలని ఆకాంక్షించారు. సిద్దిపేటలో గెలిచి ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పోటీ పడింది. కానీ ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చారన్నారు. 2023లో మాకు అధికారం ఇచ్చారనీ. 2029 మళ్లీ మాకే అధికారం ఇవ్వబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

**ఒక్కసారి అవకాశం ఇవ్వండి**

సిద్దిపేటను1984 నుంచి 2029 ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని సీఎం అన్నారు. మార్పు చేసి చూస్తే మంచి జరుగుతుందో మీరే చూడాలన్నారు. మల్లన్నసాగర్, ఏటిగడ్డకిష్టాపూర్ వంటి సమస్యలు వచ్చిన నాడు మేము నిలబడ్డామని ఈ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ వ్యవహరించినట్లు మేము వ్యవహరించడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామన్నారు. మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం, ప్రజల మేలు కోసం మాట్లాడాలి. కానీ ఏమి జరగవద్దు వీళ్లను ఏమీ చేయనివ్వొద్దు అంటే అది



ప్రజల పట్ల పగతో వ్యవహరించినట్లేనన్నారు. ప్రతిపక్షం బాధ్యత ఇది కాదన్నారు. అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్దిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్దిపేటకు వస్తామన్నారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో భిన్నాభిప్రాయాలు:**

ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే నా దృష్టి అని సీఎం చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ వారి నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ మా నిజాయితీ నిరూపించుకున్నామన్నారు. నర్మెట్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు నేను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయి. కావాలనుకుంటే నేను ఈ ఫ్యాక్టరీని కొడంగల్ కు తీసుకువెళ్లకపోయేవాడినా? కానీ ఇక్కడి రైతుల కోసం ఇక్కడే నిర్మించాం. ఆ తర్వాతే తన నియోజకవర్గానికి ఒకటి ఇవ్వమని మంత్రులను కోరుతున్నానని చెప్పారు. నేను వివక్ష చూపడంలేదన్నారు. వివక్ష గురించి మాట్లాడితే 2014 నుంచి 2023 వరకు కొడంగల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారు? మేమొచ్చాక ఈ ప్రాంతానికి నేను ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు తీద్దామన్నారు. వివక్ష మా ఇంట వంట లేదన్నారు. బీఆర్ఎస్ నేతలను చూసి చూసి ప్రజలను వేయమన్నారు. పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం మేము పని చేయామన్నారు.

## ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాత..**

పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులకు ఇబ్బందులు లేకుండా స్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద 2 కోట్ల 9 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని, 3 నెలలలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యాతనపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, ఓపెన్ జిమ్, కుర్మపల్లి శివారులో రైలింగ్, చే లింక్, ఫెన్సింగ్, బోటింగ్ ఇతర అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేసే విధంగా అధికారుల సమన్వయంతో పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లను ప్రారంభించడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం బోర్ వెల్స్, హైమాస్ లైట్లు ఏర్పాటు దిశగా కృషి చేస్తామని తెలిపారు. సి సి రోడ్డు, 2 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం కింద చర్యలు తీసుకోవడంతో పాటు ఊరు మందమర్రిలో ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు 2 కోట్ల 31 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో సి సి రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి చర్యలలో భాగంగా డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగించి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

**మిగతా పనులు పురోగతిలో..**

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టి 20 శాతం పూర్తి చేయబడి మిగతా పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా సోలార్ హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లు తగ్గించడంతోపాటు ప్రజలకు ఉపయోగకరమైన వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 21 సోలార్ హైమాస్ లైట్లు మంజూరు చేయబడి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటి కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించి నీటి లభ్యత గా కృషి చేస్తున్నామని తెలిపారు. సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వివక్షకు నిరసనగా.. 25న జర్నలిస్టుల "చలో హైదరాబాద్"

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈ నెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్- ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర వహిస్తున ్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టిడ బ్ల్యూజేఎ ఫ్) వ్యవ స్థాప క అ ధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వ డ ంలేద ని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌ను పూర్తిగా అణిచి వేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వ రైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్-ఐఅండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో రాష్టవ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లా..?

**రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి ఫైర్**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వం ధ్వంధ్వ వైఖరితో వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ ఎంఐం పార్టీకి చెందిన నేతల ఆక్రమణలను మాత్రం వదిలేస్తోందని ధ్వజమెత్తారు. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ను బండి సంజయ్ ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఇంటర్వ్యూలో రంగనాథ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ గరీంబోంకో హటావో-ఒవైసీకి బచావో అన్న చందంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లు, పేదలకు ఫుల్ ట్యాంక్ లెవల్, ఒవైసీకి మాత్రం ఫుల్ థ్యాంక్ లేవల్ అనేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ లాజిక్ ఎలా ఉందంటే విద్యార్థులు అక్రమ కాలేజీలో చదివితే అది సామాజిక కోణం, పేదల ఇళ్లు మాత్రం ఆక్రమణలు అంటూ కూల్చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 200లకు పైగా పేద కుటుంబాల ఇళ్లపైకి మెరుపు వేగంతో కదిలిన హైడ్రా బుల్డోజర్లు సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ లో ఉన్న ఓవైసీ కాలేజీ విషంలో మాత్రం జాప్యం చేస్తోందన్నారు. ప్రధాని మోదీ పీఎంఏవై ద్వారా పేదలకు గౌరవప్రదమైన నివాసాలు నిర్మిస్తుంటే కాంగ్రెస్ మాత్రం



బుల్డోజర్లను పంపిస్తోందని విమర్శించారు. చట్టం రజాకార్ వారసుల కోసం వంగి, పేదలపై మాత్రం విరుచుకుపడితే అ దిపాలన కాదని బలహీనమైన సమర్ధన మాత్రమేనని విమర్శించారు.



## ఉమ్మడి మెదక్ జిల్లా సమస్యలు పరిష్కరిస్తా

- సీఎంకి వినతి పత్రం అందజేసిన మెదక్ ఎంపీ
- సానుకూలంగా స్పందించిన రేవంత్ రెడ్డి

**గోల్కొండ టైమ్స్, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట లో తెలంగాణ నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతన ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఎంపీ రఘునందన్ రావు, సీఎం రేవంత్ రెడ్డి కి పలు అభివృద్ధి అంశాలపై వినతి పత్రాన్ని సమర్పించారు. గజ్వేల్‌లో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కింద దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కాలువల ద్వారా సాగునీరు అందించాలని కోరారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని ఎనిమిది గ్రామాలకు నీటి సరఫరా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 765 డిజి జాతీయ రహదారిపై హబ్సిపూర్ నుంచి దుబ్బాక అంబేద్కర్ విగ్రహం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మించాలని సూచించారు. ఎనగుర్తి చౌరస్తా నుంచి బొప్పాపూర్ మీదుగా శిలాజీనగర్ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కొండపాక మండల కేంద్రంలో కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ మరియు సంగారెడ్డి జిల్లాల్లో ఆయిల్ పామ్ కంపెనీలను తక్షణమే ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ సమస్యలను పరిష్కరించాలని ఎంపీ రఘునందన్ రావు ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమస్యలకు సానుకూలంగా సీఎం స్పందించి ఉమ్మడి మెదక్ జిల్లాలో నెలకొన్న సమస్యలపై ఎంపీ రఘునందన్ రావు ఇచ్చిన వినతి పత్రంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని రైతు మహోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎంపీ కి హామీ ఇచ్చారు.

## అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బడ్జెట్

**రాష్ట్ర బడ్జెట్ పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**గోల్కొండ టైమ్స్, పెద్దపల్లి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బడ్జెట్ ని తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధుకర్ గార్ల తో కలిసి బి.ఆర్.ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యాలయం లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీ దాసరి మనోహర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం స్కీములకూ గండికొట్టి,... స్కాం లను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం క్రమంగా అటకెక్కిస్తున్నది.....కేసీఆర్ పేరును కనుమరుగు చేస్తోంది . రెండున్నరేండ్లలో 3.47 లక్షల కోట్ల అప్పు చేశామని గర్వంగా చెప్పుకుంటున్న సీఎం.. ఇదీ మేం పూర్తి చేసింది!' అని చెప్పేందుకు ఒక్క ఉదాహరణ లేదు. రూ.3,24,234 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏమీ లేదు . 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత పన్నుల రాబడి రూ.1,11,798 కోట్లు వచ్చినట్టు నిరుటి బడ్జెట్‌లో పేర్కొన్న ప్రభుత్వం.. 2024-25 సంవత్సరానికి రూ.1,09,233 కోట్లు వచ్చినట్టు తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. అంటే ఏడాదిలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది చెప్తున్నది! పదేండ్లలో 16 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు తో దేశంలోనే తెలంగాణను టాప్‌స్టేట్‌గా నిలబెట్టిండు కేసీఆర్. అటువంటి రాష్ట్రాన్ని తిరోగమనం లోకి



నెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం! ఆరు గ్యారెంటీలను పూర్తి చేయడానికి కూడా చేతులు రాలేదు. తులం బంగారం, మహాలక్ష్మి కింద మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇలా ఆరు గ్యారెంటీలకఈసారి బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయించలేదు.. 2025-26 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారెంటీలకు రూ.56,083 కోట్లు కేటాయించింది. తాజా బడ్జెట్‌లో మాత్రం రూ 50,713 కోట్లకే పరిమితం చేసింది. అంటే రూ.5,370 కోట్లు కోత పెట్టింది. మహాలక్ష్మి పథకం కింద 18 నుంచి 60 ఏండ్ల లోపు అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ.2500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల కుటుంబాలు లబ్ధిదారులుగా ఉండగా, ప్రభుత్వం 48 లక్షల కుటుంబాలకే గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం నుంచి చక్కగా సాగుతున్న 1,023 గురుకుల పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రతి స్కూల్‌కూ రూ.200 కోట్లు ఖర్చు చేసి 109 స్కూళ్లు కట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. గత బడ్జెట్‌లో రూ.2,900 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూ. 200 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. తాజా బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించింది. బడ్జెట్‌లో అంకెల గారడీ వ్యవసాయానికి పెద్దపీట వేయాల్సిన ప్రభుత్వం నిధుల్లో కోత పెట్టింది.

# బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు

- టీడీఆర్ వినియోగం, హై-రైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై మార్గదర్శకాలు
- ఉత్తర్వులు జారీ

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

తెలంగాణలో భవన నిర్మాణ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు చేసింది. ఇందులో భాగంగా 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ - 2012'కు కీలక సవరణలు చేస్తూ ఆదివారం జీవో.95విడుదల చేసింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పేరుతో వెలువడిన ఈ జీవోలో టీడీఆర్ వినియోగం, హై-రైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

**హై-రైజ్ భవనాల కొత్త నిర్వచనం**

ఇకపై 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే 'హై-రైజ్' భవనాలుగా పరిగణిస్తారు. పారిశ్రామిక భవనాల్లో ఉండే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, బాయిలర్ రూములు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులు, ఇతర నిర్మాణ ఫీచర్లను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు.

**టీడీఆర్ వినియోగంపై కఠిన నిబంధనలు**

**చిన్న ప్లాట్లకు నిబంధన:**

750 చ.మీ నుండి 2000 చ.మీ మధ్య ఉండే ప్లాట్లలో



18 మీటర్ల నుండి 21 మీటర్ల ఎత్తు వరకు భవనాలు నిర్మించాలంటే టీడీఆర్ వినియోగం తప్పనిసరి.

భారీ భవనాలపై లోడింగ్: 10 అంతస్తుల నుండి 20 అంతస్తుల లోపు ఉండే భవనాలకు 10 అంతస్తుల పైబడిన బిల్ట్-అప్ ఏరియాపై 3 శాతం టీడీఆర్ లోడింగ్ ఉండాలి. 20 అంతస్తుల పైబడిన భవనాలకు 20 అంతస్తుల పైబడిన ఏరియాపై 5 శాతం టీడీఆర్ వినియోగించాల్సి ఉంటుంది.

సమర్పణ విధానం: బిల్డింగ్ పర్మిషన్ సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలి. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందే ముందు సమర్పించడం తప్పనిసరి.

**అదనపు అంతస్తులకు వెసులుబాటు**

2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

40 ఫీట్ల రోడ్డు: 3 అదనపు అంతస్తుల వరకు అనుమతి.
60 ఫీట్ల రోడ్డు: 4 అదనపు అంతస్తుల వరకు అనుమతి.
80 ఫీట్ల రోడ్డు: 5 అదనపు అంతస్తుల వరకు అనుమతి.
(గమనిక: ఇవి ఫైర్, ఎయిర్‌పోర్ట్, ఇతర నిబంధనలకు లోబడి ఉండాలి).

**సెట్‌బ్యాక్ సడలింపులు, ఇతర మార్పులు**

హై-రైజ్ భవనాల్లో టీడీఆర్ వినియోగం ద్వారా అనుమతించబడిన సెట్‌బ్యాక్స్‌లో 10 శాతం వరకు రిలాక్సేషన్ పొందే అవకాశం కల్పించారు. అయితే, భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్‌బ్యాక్ ఉండాలనే నిబంధనను కచ్చితంగా పాటించాలి. ఒకవేళ మాస్టర్ ప్లాన్ రోడ్లను మార్చినప్పుడు, తొలగించినప్పుడు, దరఖాస్తుదారులు వర్తించే కన్వర్షన్ ఛార్జీలు చెల్లించడం, దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతోనగరంలో నిలువు అభివృద్ధి పెరుగుతుందని, అలాగే పారదర్శకమైన భవన నిర్మాణ ప్రక్రియకు వీలు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి.

# భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే..

భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే.. అయ్యుంటే... ఇలా ఆలోచించడం విచిత్రంగా అనిపించవచ్చు కానీ ఊహించవచ్చు కదా.. ఒక వేళ జరిగితే. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లను 1931 మార్చ్ 23న ఉరి తీసి, తల్లి తండ్రులకు యివ్వకుండా యమునా నదిలో రాత్రికి రాత్రే పడేసారు. ఇస్తే ఎట్లుంట దోనని ప్రపంచాన్ని ఏలుతున్న బ్రిటీష్ ప్రభుత్వం కూడా భగత్ సింగ్‌కి వచ్చిన పేరుకు బయపడింది. తన చావును భగత్ సింగ్ ఊహించనిది కాదు. తెలిసే చావు నోట్లోకి తల పెట్టీ మరీ చివరి వరకు పోరాడాడు. అట్లా చరిత్రలో వలస వ్యతిరేక దేశాల్లో ఇంతటి త్యాగము చేసిన వాళ్ళలో భగత్ సింగ్ ముందుంటాడు. అంతటి త్యాగ ధనుడు, పోరాట యోధుడు మరణించక పోయుంటే, ఆయనే ప్రధాన మంత్రి అయ్యుంటే ఏమి జరిగేది. అయ్యిండే వాడా అనే సందేహం అక్క రలేదు. అప్పటికే స్వాతంత్ర పోరాటంలో నెహ్రూ కంటే అత్యంత ఫేమస్ అయిన వ్యక్తి భగత్ సింగ్. ఒక్కో సందర్భంలో గాంధీ కంటే ఈ దేశంలో భగత్ సింగ్ పేరే వినిపించింది అని కాంగ్రెస్ నేత పట్టాభి సీతారామయ్య చేసిన వ్యాఖ్యలు గుర్తుపెట్టుకుంటే అది అతిశయోక్తి అస్సలు కాదు. అందుకే భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయ్యే అవకాశం తప్పక ఉండిందనేది మన ఊహ తప్పుకాదు.

> ప్రపంచానికి దూరంగా ఉన్న గిరిజనులకు అడవితో ఉన్న పేగుబంధాన్ని తెంపకుండా అడవి వారి బతుకు హక్కుగా ఇచ్చి, తల్లిలా అడవిని కాపాడుకొనే బాధ్యత వారి చేతుల్లోకే చేరేది. అడవి కొట్టకుండా అభివృద్ధి ప్రణాళికలు ఉండేవి. పట్టణాలను పకడ్బందీ ప్రణాళికతో నిర్మాణం గావించబడేవి. రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ వందేళ్ల ముందుచూపుతో వేయబడేవి. చెరువులు, కుంటలు, నదులు చెడిపోకుండా ఆనకట్టలు కట్టి అందరికీ తాగునీరు, సాగునీరు ఇచ్చేవారు. కాలుష్యం కానరాని స్వచ్ఛమైన నీరు వాగ్దానం చేయబడేది. అందుకే ఆకలితో అల మటించని పచ్చని పైరులతో సస్య శ్యామలమైన సువిశాల దేశంగా ఇండియా ఉండేది.

ఒకవేళ అయ్యుంటే ఎలా ఉండేది. ఆయన ఆచ రణలో అత్యంత వీరుడిగానే కాదు ఆయన ఆలో చనలను బట్టి చూస్తే ఈ దేశంలో అతిగొప్ప మేధావులకు ఈ మాత్రం తీసిపోని వ్యక్తి అనేది సందేహమే లేదు. అప్పటికే హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ కి రాసిన కరపత్రం కానీ, 'వై అయామ్ యాన్ ఎతీస్ట్' అనే వ్యాసం గానీ, లేకపోతే ఆయన వివిధ సందర్భాల్లో రాసిన లేఖలు గానీ చదివితే మనకు భగత్ సింగ్ థింకింగ్ పవర్ ఏంటో అర్థం అవుతది. అలాంటి ఉడుకునెత్తురు ఉన్న యువ హీరో, హైలెవల్ థింకర్, ఎంతో దూర దృష్టి ఉన్న నేత అప్పటికాలంలో ఇంకెవరూ లేరనే చెప్పాలి. ఫ్యూచర్ మీద అత్యంత క్లారిటీ ఉన్న లీడర్ మొత్తం స్వాతంత్ర్యోద్యమంలో ఒక రిద్దరు తప్పితే ఎవరూ కనిపించరు. నిజానికి భగత్ సింగ్ లా దేశం మొత్తం పాపులర్ అయిన వ్యక్తులను బ్రిటీష్ ప్రభుత్వం ఎవరినీ చంపలేదు. కేవలం భగత్ సింగ్ నే చంపింది. ఎందుకంటే ఆయన ఆలోచన ధోరణి మాత్రమే వారు అత్యంత ప్రమాదంగా భావించారు. ఆ భావన, థాట్ ప్రాసెస్ కే బ్రిటీష్ వాడు భయప డ్డాడు. ఈ నేపథ్యంలో నుంచే ఈ దేశానికి ప్రైమ్ మినిస్టర్ అయితే ఈ దేశ రూపు రేఖలు ఎలా ఉండేవి, ఏమి జరిగుండేది.

భగత్ సింగ్ గురించి మాట్లాడుతూ అనేకులు చెబుతున్న విషయాలను బట్టి చూసినా ప్రైమ్ మినిస్టర్ భగత్ సింగ్ తప్పక ఈ దేశ భవిష్యత్ ను అత్యంత సుందరంగా తీర్చి దిద్దేవాడు. ఇన్నే ళ్లకాలంలో ఈ దేశం ప్రపంచ పటంలో నెంబర్ వన్ గా నిలిచేది. లేకుంటే ప్రపంచ సంపన్న దేశాలలో రెండు మూడు స్థానాల్లో తప్పక ఉండేది. ఎందుకంటే ఏ పనులు చేస్తే ఈ దేశం అభివృద్ధి చెందేదో ఆయనకు క్లారిటీ ఉంది కాబట్టి.

> భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే ప్రపంచ దేశాలతో సహకారంగా భారత్ ఉండేది. పక్క దేశాలు పక్కాగా మనకు దోస్తీ చేసేవి. ఆపద వస్తే వాటికి అండగా మన దేశం నిలబడేది. యుద్ధం ప్రపంచ ప్రజల వినాశనానికే అనే విధానంతో ఇండియా ఉండేది. భగత్ సింగ్ ఉంటే అమెరికా సామ్రాజ్య వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. బాధిత దేశాలకు తప్పక అండగా ఉంటామని ప్రకటించేవాడు. అంతేకాదు. ప్రపంచంలో అన్ని దేశాలకు దిక్కు ఇండియా అయ్యేది. ఐక్యరాజ్య సమితిలో ఇండియా ఎప్పుడో శాశ్వత దేశం అయ్యేది. భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే భారత్, చైనా, రష్యా ప్రపంచానికి భరోసా నిచ్చేవి. అమెరికా ఏ దేశంపైనా యుద్ధం చేయడానికే జంకే స్థితి ప్రపంచ యవనికమీద ఏర్పడేది. జగతికి వెలుగులా ఇండియా అయ్యేది.

భగత్ సింగ్ బాధ్యతలోకి ఆయన తన చివరి గడియల్లో ఉరి ముంగిట కోరిన కోరిక మేరకు, తన మొదటి అడుగు పెద్ద దళిత తల్లి ఇంట్లో పడేది. ఆ తల్లి చేతి ముద్ద తిని అక్కడే ఇంకెవరూ ఈ దేశంలో అంటరాని వారుగా ఉండడానికి లేదని, వివక్ష కొనసాగడానికి వీలు లేదనీ తీర్మానం ప్రకటించేవాడు. అసలు కుల వ్యవస్థ రద్దు అనే ప్రక్రియ మొదలెట్టేవాడు. కులాన్ని పాటించడం అత్యంత నేరమని ప్రకటించే వాడు. కుల, మత సర్టిఫికెట్ లేని స్థితి ఉండేది. దేశ నిర్మాణానికి అత్యంత ముఖ్యమైన ఈ దేశ రాజ్యాంగం ఎంతో ఉన్నతంగా ఉండేది. అంబేద్కర్ రాసి, చేర్చలేని ఇంకా ఎన్నో అందులో చేరేవి. పేదలకు చుట్టాలుగా భావించే అద్భుతమైన చట్టాలు రాజ్యాంగంలో భాగం అయ్యేవి. గుంటెడు జాగలేని పేదోడికి ఇల్లొచ్చేది. శ్రమ చేసే శక్తి ఉన్న జనానికందరికీ ఈ దేశ భూమి పంచపడటం అత్యంత పకడ్బం దీగా మొదటి రెవల్యూషనరీ పనిగా చేస్తుండే వాడు. బువ్వలేక సతమత మయ్యే బక్కోడి నోట్లోకి నాలుగు ముద్దలు చేరే ముందటి కర్తవ్యంగా ఉండేది.

ఈ దేశంలో సగభాగమైన మహిళల కోసం అంబేద్కర్ తలపెట్టిన హిందూ కోడ్ బిల్లు చట్టంగా రూపొందేది. అంబేద్కర్ సహచ ర్యంతో ఆయన ముందుకెళ్ళేవాడు. చట్టసభ ల్లోనే కాదు యావత్ దేశ అన్ని విభాగాల్లో మహిళలకు ముప్పై మూడు శాతం డిమాండ్ కంటే ఇంకా ముందడుగు వేసి యాభై శాతం మహిళల హక్కు అనేదానినీ నిజం చేసేవాడు. ఆయన ఉద్యమంలో మహిళకు ఇచ్చిన గౌరవం ఇచ్చిన దానికి నిదర్శనంగా ఉండేది.

ఆరుగాలం కష్టపడే రైతు కన్నీళ్లు తుడిచే పంటకు మద్దతు ధర ఇవ్వడమే కాదు ప్రభుత్వమే పంటలనుకొని ప్రతి కుటుంబానికి అందించేది. దళారీ, కార్పొరేట్ మోసంను దయలేకుండా అణిచేసే వాడు. పంటకు విత్తనాలు కూడా ప్రభుత్వమే అందించేది. రైతు ఆత్మహత్యలు జరగని సమాజానికి దారులు పరిచేవాడు. అంతే కాదు ఈ దేశ ప్రజలు అవ సరాలు తీర్చే పరిశ్రమలు పద్ధతిగా ప్రభుత్వ పరి ధిలోనే నడిచేవి. ఉన్నోళ్లు పరిశ్రమ పెట్టీ దోచుకునే వ్యవస్థ రద్దయ్యి ప్రతిభ జనం సహ కారంతో ప్రభుత్వం నడిపే పరిశ్రమలు ఉండేవి. కార్మికులకు సరిపోయే వేతనాలు, సెక్యూరిటీ ఉండేవి. ఏ రంగాల్లో ఎంత ఉత్పత్తి అవసరం, ఇతర దేశాలకు ఎంత ఎగుమతి అనే ప్రాతిపదికతో ప్రణాళిక బద్ధమైన పరిశ్రామిభి వృద్ధి ఈ దేశ విధానంగా ఉండేది. అన్ని రంగాల ఉద్పాదకతలో దూసుకుపోయేది.

ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ చదువు బాధ్యత ప్రభుత్వందేననే భగత్ సింగ్ ప్రభుత్వ విధానంగా ఉండేది. గూడెం గుడిసె తండాలో చీకటి బతుకుల్లో చదువు వెలుగులు వెలిగించే వాడు. ఆ చదువు అత్యంత సైంటిఫిక్ గా ఉండేది. అదో జీవన విధానం అయ్యేది. చైనా లాగా, నాటి సోవియట్ లాగా ప్రాక్టికల్ ఎడ్యు కేషన్ హై క్వాలిటీగా ఉండేది. న్యూ ఇన్నోవే షన్‌కు క్లాస్ రూమే బేస్ అయ్యేది. అంతేకాదు నెహ్రూ స్థాపించిన రీసెర్చ్ సెంటర్స్ కంటే ముందుకెళ్ళి ప్రపంచంలో అత్యంత టెక్నాలజీ కింగ్‌గా భారత్ అవతరించేలా సైంటిస్ట్‌లకు ప్రోత్సాహం ఉండేది. అంతరిక్షం అత్యంత చవకగా వెళ్లొచ్చే మార్గం అయ్యేది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఎగిరే వ్యవస్థ ఇప్పటికే వచ్చేది. చంద్ర మండలంలో అడుగు పెట్టడమే కాక మార్స్ పైకి ఫస్ట్ చేరే దేశం అయ్యేదేమో.

వైద్యం అందక మలేరియాతో చచ్చే అవస్థ అంతం ఎప్పుడో అయ్యేది. ఉచిత వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అయ్యేది. మన దేశంలో కేరళ, ప్రపంచంలో క్యూబా లాగా ప్రతి ఊరికి ఎంబీ బీఎస్ డాక్టర్‌లు ఉండేవారు. ఇంటివద్దకే వైద్యం వచ్చేది. ఏ రోగానికైనా మందు కనుగొనే మొదటి దేశాల చెంతన ఇండియా ఉండేది. కూడు, గుడ్డతో పాటు వైద్యం గ్యారంటీ కాబడేది.

చదువుకున్న ప్రతిఒక్క యువకునికి పని కల్పిం చబడటం ఈ దేశాభివృద్ధికి అత్యంత ముఖ్యమైన బాధ్యతగా ఉండేది అది భగత్ సింగ్ నినాదంలా ఉండేది. ప్రతిభ ఉన్న యువతకు ఉమ్మడి పరిశ్రమ స్థాపించడానికి రాయితీ ఇచ్చి ప్రోత్సాహంచే వ్యవస్థ ఉండేది. బ్యాంకులు ఎట్లాగూ జాతీయం కాబడేవి. వృత్తి పరిశ్రమలు కూడా ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహం ఇచ్చి, కుల ఆధారిత వృత్తి పనులు ఆగి ఆధునికతలో వారిని భాగస్వామ్యం చేసేలా ఉండేది. స్పోర్ట్స్ ప్రతి పిల్లాడికి తప్పని సరి విద్యా వ్యవస్థలో చేసి ఉండటమే కాదు. ఒలింపిక్స్‌లో నెంబర్ వన్ లేదా టూలో ఉండే స్థితి వచ్చేది.

ప్రపంచానికి దూరంగా ఉన్న గిరిజనులకు అడవితో ఉన్న పేగుబంధాన్ని తెంపకుండా అడవి వారి బతుకు హక్కుగా ఇచ్చి, తల్లిలా అడవిని కాపాడుకొనే బాధ్యత వారి చేతుల్లోకే చేరేది. అడవి కొట్టకుండా అభివృద్ధి ప్రణాళి కలు ఉండేవి. పట్టణాలను పకడ్బందీ ప్రణాళి కతో నిర్మాణం గావించబడేవి. రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ వందేళ్ల ముందుచూపుతో వేయబడేవి. చెరువులు, కుంటలు, నదులు చెడిపోకుండా ఆనకట్టలు కట్టి అందరికీ తాగునీరు, సాగునీరు ఇచ్చేవారు. కాలుష్యం కానరాని స్వచ్ఛమైన నీరు వాగ్దానం చేయబడేది. అందుకే ఆకలితో అలమటించని పచ్చని పైరులతో సస్య శ్యామ లమైన సువిశాల దేశంగా ఇండియా ఉండేది.

ఎన్నుకొనే విధానం, ఓటు హక్కు అందరికీ ఉండటమే కాదు ప్రాతినిధ్య ఎన్నిక విధానం ఉండేది. ఎంత శాతం అనే దాన్ని బట్టి వారికి అన్ని సీట్లు అనే సిస్టమ్ ఉండేది. ఎన్నికయిన వారు తప్పుచేస్తే మధ్యలోనే తీసేసే రిఫరెండం అడిగే హక్కు ప్రజలకు ఉండేది. బడ్జెట్ బడాబా బుకోసం, అంబానీ, అదానీల కోసం కాకుండా సామాన్యుడికి చేరే అనుసంధానకర్తగా ప్రభుత్వం ఉండేది. ప్రజా ప్రతినిధులు పక్కగా ప్రజా సేవకులుగానే ఉండే పద్ధతే భగత్ సింగ్ ఏర్పాటు చేయించేవాడు. రాజ్యంలో మతం స్థానం లేదని ఇంట్లో వరకే మతం, బయట ప్రేమించే మనుషులం ఉండేలా అన్నదమ్ముల్లా జీవించే మానవత్వం మన మతం అనే ప్రభుత్వ పద్ధతి తప్పక ఉండేది. మత కొట్లాటలు లేని దేశం వాగ్దానం కాబడేది.

భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే ప్రపంచ దేశాలతో సహకారంగా భారత్ ఉండేది. పక్క దేశాలు పక్కాగా మనకు దోస్తీ చేసేవి. ఆపద వస్తే వాటికి అండగా మన దేశం నిలబడేది. యుద్ధం ప్రపంచ ప్రజల వినాశనానికే అనే విధానంతో ఇండియా ఉండేది. భగత్ సింగ్ ఉంటే అమెరికా సామ్రాజ్య వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. బాధిత దేశాలకు తప్పక అండగా ఉంటామని ప్రకటించేవాడు. అంతేకాదు. ప్రపంచంలో అన్ని దేశాలకు దిక్కు ఇండియా అయ్యేది. ఐక్యరాజ్య సమితిలో ఇండియా ఎప్పుడో శాశ్వత దేశం అయ్యేది. భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే భారత్, చైనా, రష్యా ప్రపంచానికి భరోసా నిచ్చేవి. అమెరికా ఏ దేశంపైనా యుద్ధం చేయడానికే జంకే స్థితి ప్రపంచ యవనికమీద ఏర్పడేది. జగతికి వెలుగులా ఇండియా అయ్యేది. భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే సామ్రాజ్యవాదం మూర్ధాబాద్ అనే నినాదం దేశ ప్రతి మూలన వినబడుతూనే ఉండేది.

ఇది ఊహాత్మకమే అయినా అప్పటి రష్యా, ఇప్పటి చైనా కమ్యూనిస్టు దేశాలతో పోల్చి చూస్తే సాధ్యమేనని చెప్పొచ్చు. ఎందుకంటే ప్రపంచ మానవాళి విముక్తి సిద్ధాంతం నమ్మిన వాడు భగత్ సింగ్ కాబట్టి ఇవన్నీ జరిగేవి అనే దానిలో ఎటువంటి సందేహం అక్కరలేదు. ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాద్ మూర్ధాబాద్, భగత్ సింగ్ జిందాబాద్.



– ఏ.విజయ్ కుమార్, రచయిత
+919573715656

---

## ప్రముఖుల మరణాలతో గ్రామాల్లో విషాదం

### మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శలు

**గోల్కొండ టైమ్స్, నాగిరెడ్డిపేట్ :** నాగిరెడ్డిపేట్ మండలంలోని వదలపర్తి గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్ తల్లి మాద రాంబాయి, నిన్న మరణించిన విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ వెంటనే వారి నివాసానికి వెళ్లి ప్రవీణ్ గారిని పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం పోచారం గ్రామానికి చెందిన టేట్లపల్లి గోపాల్ రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసి, వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు.గోపాల్ రెడ్డి తమ్ముడు జనార్దన్ రెడ్డి, కుమారుడు కిషోర్ రెడ్డి గార్లను కలిసి వారి దుఃఖంలో భాగస్వామ్యమయ్యారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండల నాయకులు పాల్గొన్నారు.

---

## తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్

- బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్
- మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**గోల్కొండ టైమ్స్, కుత్బుల్లాపూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ మోసపురితమైన బడ్జెట్ అని నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై విలేక రుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు,11 డిక్లరేషన్లు అన్నీ మోసమే అని, కాంగ్రెస్ దగాకోరు తనానికి నిదర్శనం ఈ బడ్జెట్ అని భారతదేశ చరిత్రలో ప్రజలను ఇంతగా ధగా చేసే మోసపూరితమైన బడ్జెట్ ను చూడలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కష్టాలు, కన్నీళ్లు, కూల్చివేతల పాలనగా మారిందని, ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని అన్నారు. తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ ఇదని ఈ బడ్జెట్లో పేదలకు, రైతులకు, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదని రైతు భరోసా పెంపు పై స్పష్టత ఇవ్వలేదని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని, తులం బంగారం పేరుతో పేద మహిళలను మోసం చేశారని, రెండు లక్షల ఉద్యోగాలు, రాజీవ్ వికాస్ పేరుతో యువతకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని, వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని, దళితులకు ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల హామీని పూర్తిగా విస్మరించారని ఆపథకానికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదని ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఈ బడ్జెట్ తీరని ద్రోహం చేసిందని విమర్శించారు.

ఈ బడ్జెట్ ప్రసంగం మొత్తం అబద్ధాలు, మోసాలతో నిండి ఉందని కెసిఆర్ పాలనలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాం కానీ కాంగ్రెస్ పాలనలో తెలంగాణను తిరోగమనంలోకి నెట్టేశారని బడ్జెట్ అన్నారు.

కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం జరిందని, 42 శాతం రాజకీయ రిజర్వేషన్ల విషయంలో మోసం చేశారని ఈ బడ్జెట్ ఉద్యోగులను, పెనసర్లను పూర్తిగా నిరాశపరిచిందని



పీఆర్సీపై ఎలాంటి ప్రస్తావన లేదని ఐదు డీఏలు పెండింగ్లో ఉన్నాయని రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వడం లేదని, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలపై స్పందన లేదని, డొల్ల బడ్జెట్ గోల్మాల్ బడ్జెట్ అని, హైదరాబాద్ ను మూడు భాగాలుగా చేసి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని, తాగునీటి సమస్యపై ప్రస్తావనే లేదని, కొత్త కార్పొరేషన్లకు ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్, అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచి తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, సుజాత, దేవి చందు ముదిరాజ్, బిఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబ శివారెడ్డి, సీనియర్ నాయకులు మేకల మధుసూదన్, రవీందర్ రెడ్డి, కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

---

## కామారెడ్డిలో జాబ్ మేళా విజయవంతం




- భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత
- ఉద్యోగార్థులకు నియామాక పత్రాలు

**గోల్కొండ టైమ్స్, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్శి రాములు కళ్యాణ మండపంలో జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ఆదివారం నిర్వహించారు. జాబ్ మేళాను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. జాబ్ మేళాకు కామారెడ్డి, బిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, బీబీపేట్, పాల్వంచ, రామారెడ్డి మండలాలతో పాటు సమీప ప్రాంతాల నుంచి భారీగా యువత ఇంటర్వ్యూకు హాజరయ్యారు. నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, జాబ్ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. 50 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరు కాగా, 3500 మంది నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు. ఇందులో టెక్నీకల్, నాన్ టెక్నీకల్, ఐటీ, ఫార్మ, మెడికల్, బ్యాంకింగ్, వెల్ఫేర్, రియల్ ఎస్టేట్ తదితర రంగాల నుంచి కంపెనీలకు సంబంధించిన వాటికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో ఎంపికైనా 325 నిరుద్యోగ యువతకు నియామాక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిండ్ల అంజయ్య, డీసీసీ ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, సబ్బని కృష్ణహరి, నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జూలూరి సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, తాటి ప్రసాద్, రాంశెట్టి హర్షిత, మాజీ కౌన్సిలర్లు శంకర్ రావు, చాట్ల వంశీ, కాంగ్రెస్ నాయకులు జమీల్, రవీందర్ గౌడ్, రంగా రమేష్ గౌడ్, నర్సొల్ల మహేష్, బల్ల శ్రీనివాస్, నిరంజన్, మెహర్ బాబా, గంగారాములు తదితరులు పాల్గొన్నారు.

---

## పేద ముస్లిం కుటుంబానికి రంజాన్ తోఫా అందజేత



**గోల్కొండ టైమ్స్, సిద్దిపేట :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రంజాన్ తోఫా" పంపిణీ కార్యక్రమం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలో దౌలాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ కీర్తిశేషులు జహూర్ కుటుంబానికి ఈ తోఫాను అందజేసి, వారి పండుగ ఆనందంలో కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములయ్యారు. గ్రామ సర్పంచి కుక్కునూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మర్రి కింది మహేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కుక్కునూరి నారాయణ, ఉపాధ్యక్షులు పోకల ఐలేని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పేద ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పబ్బ నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు బరిగే బాలరాజుతో పాటు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు మదికుంట ఉప్పల్ రెడ్డి, ముక్కెర అశోక్, దిసేటి భాస్కర్, కుక్కునూరి ప్రభాకర్, జూపల్లి భాస్కర్, బయ్యారం శ్రీనివాస్, ముక్కెర భాస్కర్, జూపల్లి మహేందర్, బరిగే నర్సింలు, ముక్కెర కిష్టయ్య, ఆకారం శ్రీనివాస్, ఆకారం మల్లేష్, అన్నమైన శ్రీనివాస్ తదితరులు పాల్గొని జహూర్ కుటుంబ సభ్యులకు తోఫాను అందజేశారు.

## ఊట్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బుషిగారి కృష్ణ

**గోల్కొండ టైమ్స్, జిన్నారం :** జిన్నారం మండలం ఊట్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బుషిగారి కృష్ణ ఎన్నికయ్యారు. ఆదివారం ముదిరాజ్ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో బుషిగారి కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొగురు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా క ప్పెర మ హేష్, కోశాధికారిగా పూజారి బిక్షప తి, డైరెక్టర్లుగా పూజారి రాజు, దొమ్మ సురేష్, బొగురు వీరేష్, కంచం బిక్షపతి , సుంకర బోయిన శ్రీకాంత్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుషిగారి కృష్ణ మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్య వాదాలు తెలిపారు.



---

## బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాల్సిందే

### బడ్జెట్లో బీసీలపై వివక్షత చూపించి అవమానించారు



- బడ్జెట్‌లో కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కారు
- నిధులు కేటాయించాడానికి మనసురావడం లేదు
- బడ్జెట్‌లో అన్యాయాన్ని సరిదిద్దక పోతే అసెంబ్లీ ముట్టడిస్తాం
- బీసీ సంఘాలు, అఖిలపక్ష నేతల హెచ్చరిక

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :** అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను నమ్మించి గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై అన్ని రంగాలలో వివక్షత చూపిస్తూ నయవంచనకు గురి చేస్తుందని బిసి సంఘాల నేతలు, అఖిలపక్ష పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ – బీసీల వాటా అంశంపై సమావేశం జరిగింది బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి టిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు జీ ఆనంద్ గౌడ్, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ లు పాల్గొని మాట్లాడారు. ముందుగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గత రెండు బడ్జెట్లలో అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఈ సారి ప్రవేశపెట్టిన మూడవ బడ్జెట్‌లో కూడా అన్యాయం జరిగింద న్నారు. బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని, చట్టబద్ధమైన బీసీ సబ్ తీసుకురావాలని, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడం కోసం పదివేల కోట్లు బడ్జెట్లో కేటాయించాలని తాము డిమాండ్ చేస్తూనే వస్తున్నామని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చెవిటి వారి ముందు శంఖం ఊదిన చందంగా వ్యహరించిందని ఆయన అన్నారు. బీసీలకు బడ్జెట్లో బిక్షంగా కాకుండా, ఒక హక్కుగా దక్కాలంటే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా బీసీలకు కూడా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తీసుకురావడానికి తక్షణమే రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీల బడ్జెట్ తగ్గించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అవమానించిందని, అప్పుల్లో బీసీలకు రెండు లక్షల కోట్లకు పైగా కేటాయింపులు రుద్ది, సంపదలో కేవలం రూ.9000 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం సిగ్గుచేటన్నారు. బడా కాంట్రాక్టర్లకు 70 వేల కోట్లు దోచిపెట్టిన ప్రభుత్వం బడుగు విద్యార్థులకు రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాక పోవడం సిగ్గుచేటు అన్నారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ.. మూడు లక్షల 24 వేల కోట్ల బడ్జెట్లో బీసీల సంక్షేమానికి కేవలం రూ.2,500 కోట్లు కేటాయించి బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, 60 శాతం ఉన్న జనాభాకు 3.8% నిధులు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 136 కులాల అభివృద్ధికి బడ్జెట్లో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా బీసీలను నమ్మించి నట్టేట ముంచిందని ఆయన ఆరోపించారు.

మాజీ ఎంపీ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఎవరి వాటా వారికి దక్కాలని సూత్రం రాష్ట్రంలో అమలు కావడం లేదని, జనాభా లెక్కల ప్రకారం బీసీలు 56% ఉంటే బడ్జెట్లో నిధులు అతి స్వల్పంగా కేటాయించి నందుకు తాను సిగ్గుపడుతున్నానని ఆయన అన్నారు. అధికార పార్టీలో ఉండి కూడా బీసీలలో వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని బీసీల తరపున గళం విప్పుతున్నానని, బీసీలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరుతానని ఆయన అన్నారు. బీసీ సంఘాలు చేస్తున్న పోరాటానికి బీసీ బిడ్డగా మద్దతు ఇవ్వడానికి ఈ సమావేశానికి వచ్చానని విహెచ్ తెలిపారు.

బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్క లేకుండా పోయిందని, ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న బీసీలకు అన్యాయం చేస్తున్నారని, ఈ అన్యాయాన్ని బీసీ సమాజం ఎప్పటికీ సహించదని ఆయన హెచ్చరించారు. బీసీ సబ్ ప్లాన్ లేకపోవడంతో బీసీలకు రావలసిన నిధులు రావడం లేదని, పన్నుల రూపంలో బీసీలు ప్రభుత్వ ఖజానాను నింపుతున్న, దొడ్డిదారిన ఉన్నత వర్గాలకు నిధులను మళ్లిస్తూ బీసీలకు చిప్ప చేతికిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిసి సంఘాలు అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిస్తే బిజెపి పార్టీ ప్రత్యక్షంగా అసెంబ్లీ ముట్టడిలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్, బీసీ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్దన్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లేపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

